పెళ్లి ఎలా చేసుకుంటావో చూస్తా

యువతిని బెదిరించిన ప్రియుడిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5: ప్రేమపేరుతో యువతిని మోసం చేయడంతోపాటు, ఆమె పెళ్లిని చెడగొట్టేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బ్యూటీ పార్లర్‌లో బ్యూటీషియన్‌గా పనిచేస్తున్న యువతి(23)కు రెండేళ్ల క్రితం నవీన్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. ప్రేమిస్తున్నానంటూ ఏడాది పాటు నమ్మించిన నవీన్.. పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా నిరాకరించాడు. దీంతో నెల రోజుల క్రితం ఆమెకు వేరే యువకుడితో పెళ్లి కుదరడంతో పాటు ఎంగేజ్‌మెంట్ జరిగింది. కాగా.. రెండ్రోజుల క్రితం యువతి పనిచేస్తున్న బ్యూటీ పార్లర్‌వద్దకు వచ్చిన నవీన్.. న్యూసెన్స్‌చేయడంతోపాటు వేరే వాళ్లను ఎలా పెళ్లిచేసుకుంటావో చూస్తానంటూ హెచ్చరించాడు. ఆమె వద్ద నుంచి ఫోన్ లాక్కుని.. ఆమె కాబోయే భర్త నంబర్‌ను తీసుకుని గతంలో తామిద్దరూ ముద్దు పెట్టుకుంటున్న ఫొటోను పంపించాడు. ఈ మేరకు బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'క్రషర్లపై చర్యలు తీసుకోవాలి'

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 : కాలుష్యం వేదజల్లే క్రషర్ మిషన్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం శంషాబాద్ మండల సీపీఐ కార్యదర్శి నర్రగిరి, ఆర్ యాదగిరిలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కొత్వాల్‌గూడ రెవెన్యూ పరిధిలోని ఔటర్‌రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న భూములను లీజుకు తీసుకొని క్రషర్ మిషన్లతో పాటు క్రషర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారని వివరించారు. పలుమార్లు శంషాబాద్ మున్సిపల్ కమిషనర్‌తో పాటు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రషర్ మిషన్లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా క్షేత్ర స్థాయిలో విచారణ చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నేడు విద్యా వికాస్ హైస్కూల్..

వార్షికోత్సవ వేడుకలు

మణికొండ, ఫిబ్రవరి 5: ఖానాపూర్‌లోని విద్యా వికాస్ హైస్కూల్ 30వ వార్షికోత్సవ వేడుకలను గురువారం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ టి.హేమలత, కరస్పాండెంట్ టి.రాములు తెలిపారు. ఉత్సవ-2025 పేరుతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు.

తారామతి బారదారి ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్ర మం ఉంటుందన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మె ల్యే టి.ప్రకాశ్‌గౌడ్, రిటైర్డ్ ఆర్‌బీఐ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణలు హాజరుకానున్నట్లు తెలిపారు.

విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు

- సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో విద్యుత్ కోతలకు చెక్..
- అదనంగా 42 విద్యుత్ నియంత్రికలు ఏర్పాటు..
- అందుబాటులో 10 మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు

యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్

జూబ్లీహిల్స్,ఫిబ్రవరి 5: ఫిబ్రవరి ఆరంభంలోనే వేసవిని తలపిస్తూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగింది. మార్చి రాకముందే విద్యుత్ డిమాండ్ పెరగడంతో వేసవిలో అంతరాయం లేకుండా సరఫరా చేయడం అధికారులకు కత్తిమీద సాముగా మారనుంది. తరచుగా అప్రకటిత విద్యుత్ అంతరాయాలు జరుగుతున్నాయన్న అసంతృప్తి ప్రజల్లో వ్యక్తమవుతోంది. అయితే సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో రానున్న వేసవిలో విద్యుత్ కోతలకు చెక్ పెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడిస్తున్నారు. జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, ఎల్లారెడ్డిగూడ, శ్రీకృష్ణానగర్, కళ్యాణ్‌నగర్, బోరబండ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ సబ్‌స్టేషన్లతో సేవలు అందిస్తున్న అధికారులు లో వోల్టేజీ సమస్యలకు పూర్తిగా చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే సరఫరా గావిస్తున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) లకు అదనంగా ఈ ఏడాది 42 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సరఫరాలో అంతరాయం, లో వోల్టేజీ సమస్యలను పూర్తిగా అధిగమించేందుకు 160 కేవీ కెపాసిటిలో 37 విద్యుత్ నియంత్రికలు.. 100 కేవీ కెపాసిటీలో 5 ట్రాన్స్‌ఫార్మర్‌లు కొత్తగా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడిస్తున్నారు. దీంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోతే సత్వరమే అక్కడికి చేరుకుని సేవలందించేందుకు సెంట్రల్ బ్రేక్‌డౌన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వేసవిలో డిమాండ్‌కు తగ్గట్లుగా కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అందుబాటులో 10 మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు

వేసవిలో పెరిగే విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని సీబీడీ అధికారులు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ వేసవిలో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో 10 మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచనున్నట్లు సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. వేసవి వినియోగం ఒక్కసారిగా పెరిగి ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోతే ఆయా ట్రాన్స్‌ఫార్మల వద్దకు అప్పటికప్పుడు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌లు తరలించి విద్యుత్ సరఫరా గావిస్తామన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలుగనియ్యం

వేసవిలో ప్రజలకు విద్యుత్ కోతలు లేకుండా చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. డిమాండ్ ఎక్కువగా ఉన్న లైన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. లో వోల్టేజీ సమస్యను పూర్తిగా అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– టీఎస్ఎస్‌పీడీసీఎల్ డీఈ, హన్మంతరెడ్డి

పార్టీ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సూచన మేరకు ఎర్రగడ్డ డివిజన్‌లో బీఆర్ఎస్ నేతలు బుధవారం పార్టీ క్యాలెండర్లు, డైరీలను పంపిణీ ఆవిష్కరించారు. అనంతరం న్యూ శాస్త్రినగర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని పలువురి ఇండ్ల వద్దకు వెళ్లి వాటిని అందజేశారు. డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ, పార్టీ నాయకురాళ్లు కల్యాణి, ఉష, జులేఖాబీ, రజియాబేగం, సుజాత, యాదమ్మ, సైదమ్మ, అర్చన, చందన తదితరులు పాల్గొన్నారు.– ఎర్రగడ్డ, ఫిబ్రవరి 5

విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలి

నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో డైరీని ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 5: విద్యార్థుల మేధస్సుకు మరింత పదును పెట్టి వారిని విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు కీలక పాత్ర వహించాలని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ సూచించారు.బుధవారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో తెలంగాణ ప్రభుత్వ కాలేజీ గెజిటెడ్ ఉపాధ్యాయ సంఘం ముద్రించిన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకుల సౌలభ్యం కోసం సమగ్ర విద్యా సమాచారం, విద్యాశాఖకు సంబంధించిన జీవోలు సైతం ఈ డైరీలో పొందుపర్చడం జరిగిందని తెలిపారు.విద్యార్థుల్లో పాఠ్యాంశ బోధనలతో పాటు నైతిక విలువలు పెంపొందించేందుకు చొరవ తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాపోలు శ్రీనివాస్,డాక్టర్ పి.సత్యనారాయణరెడ్డి,డాక్టర్ కె.శ్రీనివాస్ రావు,డాక్టర్ రామలక్ష్మి,డాక్టర్ గంగాధర్, డాక్టర్ సూర్యకుమారి,డాక్టర్ అరుణ, సి.వి. ఎల్ నారాయణ, బాలస్వామి, ముత్త య్య, వి.రవికుమార్,శ్రీనాథ్ పటేల్ పాల్గొన్నారు.

జంతు సంరక్షణ.. సామాజిక బాధ్యత

హైదర్‌గూడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి 5: అంతరించి పోతున్న జంతువుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శంభులింగం, నారాయణగూడ వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరిడెండెంట్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.బుధవారం హైదర్‌గూడలోని ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు జంతు సంక్షేమంపై అవగాహన,వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక యుగంలో ఎన్నో జంతువులు అంతరించి పోతున్నాయని వాటి పరిరక్షణ కోసం ఉన్న చట్టా లు, హక్కులపై అవగాహన పెంచుకుని కాపాడేందుకు చొరవ చూపాలన్నారు.అనంతరం వ్యాసరచన పోటీ లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశా రు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సంజీవ రావు, డాక్టర్ బి.నవీన్‌కుమార్‌రెడ్డి,డాక్టర్ విద్యానంద్‌గౌడ్, డాక్టర్ స్వాతి, స్కూల్ హెడ్ మాస్టర్ జె.వీజీకె శర్మ, ఉపాధ్యాయులు వైదేహి,శ్రీనివాస్, అన్వర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రోగనిర్ధారణలో 'బయోకెమిస్ట్రీ' కీలకం

కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బీరప్ప

నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, ఫిబ్రవరి 5 : రోగ నిర్ధారణలో బయోకెమిస్ట్రీ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. నిమ్స్ బయోకెమిస్ట్రీ విభాగం, తెలంగాణ జాతీయ ఆరోగ్య మిషన్ సంయుక్తాధ్వర్యంలో 'హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమాటోగ్రఫీ' అంశంపై లేబోరేటరీ నిపుణులు, కన్సల్టెంట్ పాథాలజిస్టులు, బయోకెమిస్ట్, ప్రోగ్రాం అధికారులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ హీమోగ్లోబిన్ రుగ్మతల నిర్ధారణలో హిమోగ్లోబినోపతి లాంటి పరీక్షలు ఎంతో దోహదపడుతాయన్నారు. నిమ్స్ బయోకెమిస్ట్రీ విభాగం అత్యంత సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ అమర్‌సింగ్, నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఏ విద్యార్థి ఆత్మహత్య

వెంగళరావునగర్, ఫిబ్రవరి 5: పరీక్షలు సరిగా రాయలేదనే బెంగతో సీఏ చదువుతున్న ఓ విద్యార్థి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్.ఆర్.నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ జిల్లా కర్దిగుడ్డ గ్రామానికి చెందిన ఎస్.అమర్జీత్(18) ఎస్.ఆర్.నగర్‌లోని లక్ష్య కళాశాలలో సీ.ఏ. చదువుతున్నాడు. బాపూనగర్ లోని జి.వి. క్రేజీ పి.జి.హాస్టల్‌లో ఉండేవాడు. గత డిసెంబర్‌లో పరీక్షలు రాసి కర్ణాటకకు వెళ్లిన అమర్జీత్ తన తండ్రి రాజు శెట్టితో పరీక్షలు బాగా రాయలేదని చెప్పి బాధ పడ్డట్లు తండ్రి వివరించాడు. జనవరి 27న నగరానికి తిరిగొచ్చి తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు టవల్‌తో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి గదిలో ఉన్న స్నేహితుడు సుబ్రహ్మణ్యం గమనించి హాస్టల్ నిర్వాహకులకు చెప్పాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థి అమర్జీత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఎస్సీ గ్రూప్-2లోని వర్గాలకు

11 శాతం రిజర్వేషన్లు పెంచాలి

అభివాదం చేస్తున్న తెలంగాణ జనసేన నాయకులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 5 : ఎస్సీ వర్గీకరణ ఆధారంగా గ్రూప్-2లోని వర్గాలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ జనసేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అధ్యక్షులు సైదల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సుమారు 62లక్షలకు పైగా జనాభా కలిగిన గ్రూప్-2లో 18 కులాలు ఉన్నాయని, కాని వారికి కేవలం 9 శాతం మాత్రమే రిజర్వేషన్లు కేటాయించారని, ఆర్థికంగా, సామాజికంగా లబ్ధి పొందిన గ్రూప్-3 వర్గాలకు ఐదు శాతం కేటాయించారన్నారు. గ్రూప్-2 వర్గాలు వెనుకబాటుకు గురై ఉన్నారని, వారి రిజర్వేషన్లు పెంచాలన్నారు. ఈ సమావేశంలో సైదులు, సాంబశివుడు, రామలింగయ్య, సాయి సాగర్, కృష్ణ, నాగేశ్ పాల్గొన్నారు.

సమష్టిగా పని చేసి గుర్తింపు తెచ్చుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జానయ్య తదితరులు

వీసీ జానయ్య

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 5: సమష్టిగా పనిచేసి నూతనోత్తేజంతో మంచి పేరు తీసుకురావాలని , ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. బుధవారం ఆయన సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అధికారుల నియామకం విషయంలో తనకు పూర్తి స్వేచ్ఛనిచ్చారని ఎటువంటి ఒత్తిళ్లు ప్రలోభాలు లేకుండా,నియామకాలు జరిగాయని తెలిపారు.

ఇటీవల నియమితులైన అధికారులు, ఇతర ఉన్నత ఉద్యోగుల పరిచయ కార్యక్రమం జరిగిందన్నారు. అందరూ పూర్తిస్థాయిలో పనిచేసి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్ హిల్స్‌లో హైడ్రా కలకలం

జూబ్లీహిల్స్,ఫిబ్రవరి 5 : పేదలు నివాసం ఉంటున్న బస్తీల్లో సైతం హైడ్రా హల్‌చల్ చేస్తోంది. తాజాగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లోని కేసీఆర్ నగర్ బస్తీలో హైడ్రా అధికారుల పర్యటన కలకలం రేపింది. బస్తీలోని కొన్ని ఇండ్లు చెరువు శిఖం పరిధిలో ఉన్నాయని అందిన ఫిర్యాదుల మేరకు హైడ్రా అధికారి సుజిత్ నేతృత్వంలో హైడ్రా అధికారులు.. రెవెన్యూ అధికారులతో కలిసి వివరాలు సేకరించారు. సమాచారం అందుకున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అక్కడకు చేరుకుని సమీపంలోని వినాయక్ నగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని ఆక్రమణలపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకోగా బోరబండ పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. ఎదైనా ఉంటే ఫిర్యాదు చేయాలని.. మా పని మేము చేసుకుంటాం.. ఏదైనా చెప్పుకుంటే ఉన్నతాధికారులకు చెప్పాలని అధికారులు స్పష్టం చేశారు.

నేటినుంచి కొత్త రేషన్

కార్డులకు దరఖాస్తులు

జూబ్లీహిల్స్,ఫిబ్రవరి 5: యూసుఫ్‌గూడ సర్కిల్‌లో నేటి నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జీహెచ్ఎంసీ -19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. బుధవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహ్మత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల వార్డు కార్యాలయాలలో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకుని జాబితాలో పేర్లు రానివారితో పాటు కొత్తగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం కుటుంబ యజమాని ఆధార్ కార్డు, ఇతర నివాస ధృవీకరణ పత్రాలతో సంబంధిత వార్డు కార్యాలయాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 :నేడు శంషాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాలలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ ఏఈ షేక్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రశ్నించిన ప్రియురాలిపై దాడి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5: తనను ప్రేమిస్తూ.. మరో యువతితో ఎందుకు తిరుగుతున్నావంటూ ప్రశ్నించినందుకు ప్రియురాలిపై దాడికి పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మాదాపూర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న యువతి(24)కి మూడేళ్లనుంచి ప్రసాద్ అనే వ్యక్తి ప్రేమలో ఉన్నాడు. హైలమ్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రసాద్ ఇంటికి అప్పుడప్పుడూ వచ్చే యువతి శారీరకంగా దగ్గరయింది. కాగా..కొంతకాలంగా ప్రసాద్ మరో యువతితో తిరుగుతున్న విషయాన్ని గుర్తించి.. మాట్లాడాలని అతడిని జూబ్లీహిల్స్ రోడ్ నం 10(సి)కి పిలిచింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ప్రసాద్‌ను నిలదీసిన యువతిపై తీవ్ర ఆగ్రహంతో దాడికి పాల్పడ్డాడు. బాధిత యువతి.. తన సోదరికి ఫోన్ చేసి విషయం చెప్పగా ఆమె అక్కడకు చేరుకుంది. అయినా హాస్టల్ వద్దకు కూడా వచ్చి ఇలాగే కొడతానంటూ బెదిరించి వెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడిన బాధిత యువతి తన సోదరి సాయంతో మంగళవారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు నిందితుడు ప్రసాద్ మీద కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సహకార సంఘం బలోపేతానికి కృషి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

పాలమాకుల గ్రామంలో నిర్మించిన వ్యాపార సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, తదితరులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 : మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో నిర్మించిన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) వ్యాపార సముదాయాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో సహకార సంఘం బలోపేతం చేయడం కోసం అవసరమైన ఆదాయ వనరులను సమకూర్చుకుంటున్నట్లు తెలిపారు. వ్యాపార సముదాయాల నుంచి వచ్చే ఆదాయం సొసైటీ బలోపేతం కోసం ఖర్చుచేస్తామని తెలిపారు. పాలమాకుల గ్రామంలో మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీష్, సహకార సంఘం చైర్మన్లు దవాణాకర్‌గౌడ్, పాండుయాదవ్,మాజీ జడ్పీటీసీ తన్విరాజు,పార్టీ నాయకులు చంద్రారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, నీరటిరాజుముదిరాజ్, రవీందర్‌నాయక్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి,చక్రధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు దండుఇస్తారి, శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్,జుర్కి రమేష్,శివరాంనాయక్, శ్రీశైలంగౌడ్, పలువురు మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆశ వర్కర్‌ల సమస్యలపై వైద్యారోగ్యశాఖ కమిషనర్ కణ్ణన్‌కు వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, కోశాధికారి పి.గంగమణి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 5 : ప్రజల ఆరోగ్య సంరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న ఆశ వర్కర్‌లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశలకు ఫిక్స్‌డ్ వేతనంతో పాటు ప్రమోషన్‌లు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ కణ్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు.

అంగన్‌వాడీల సమస్యలపై..

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. టీచర్లకు, హెల్పర్లకు జనవరి నెల వేతననం వెంటనే చెల్లించాలని.. మినీ అంగన్‌వాడీ సెంటర్స్ నుంచి మెయిన్ అంగన్‌వాడీలుగా పరిగణించబడుతున్న టీచర్లకు 9 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని యూసుఫ్‌గూడ మధురానగర్‌లోని మహిళా, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఐసీడీఎస్ డైరెక్టర్ కాంతి వెస్లీ, ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్‌లకు వినతిపత్రాలు అందజేశారు.

వృద్ధుడు అదృశ్యం


మోహన్‌లాల్ (ఫైల్)

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి 5: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన నారాయణగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం హిమాయత్‌నగర్‌లో నివాసం ఉండే మోహన్‌లాల్ (80) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.దీంతో కుటుంబ సభ్యులు ఆం దోళన చెంది పరిసర ప్రాంతాల్లో ఆయన ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యా దు చేశారు.ఎస్సై వెంకటేశ్ కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం

వికాస్‌సింగ్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 5: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండాపోయిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాటేదాన్ బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన వికాస్‌సింగ్(25) గత నెల 18న ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేశారు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో బుధవారం మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాల అదుపు కోసమే కార్డెన్ సెర్చ్

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 5: కార్డెన్ సెర్చ్‌ల ద్వారా నేరాలను అదుపు చేయవచ్చునని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు. బుధవారం రాత్రి లక్ష్మీగూడ వాంబే కాలనీ ప్రాంతంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. జనావాసాల ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి వారి వాహనాలను సీజ్ చేశారు. అలాగే దుకాణాల్లో చేపట్టిన తనిఖీల్లో నిషేధిత గుట్కాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను నియంత్రించేందుకు స్టేషన్ పరిధిలో కార్డెన్ సెర్చ్‌లను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం

మోసం చేసిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. ఎనిమిదేళ్లుగా సహజీవనం చేస్తూ మోసం చేసిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో నివాసం ఉంటున్న మహిళ(42) భర్తతో విడాకులు తీసుకుని తన కొడుకుతో కలిసి ఉంటుంది. ఎనిమిదేళ్ల క్రితం ఆమె ఉంటున్న ఇంట్లో అద్దెకు దిగిన శ్రీనివాస్ (40) అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తనకు పెళ్లయి విడాకులు తీసుకున్నానని, నువ్వంటే ఇష్టమని నమ్మించాడు. త్వరలో పెళ్లి చేసుకుంటానంటూ పలుమార్లు ఆమెను శారీరకంగా వాడుకున్నాడు. అయితే ఏళ్లు గడిచినా ఏదో ఒకసాకు చెబుతూ పెళ్లిమాటను దాటవేస్తూ వచ్చాడు. ఇటీవల ఆమె పెళ్లి గురించి గట్టిగా నిలదీయడంతో పెళ్లి చేసుకోలేనని, ఇంట్లో కుటుంబసభ్యులు ఒప్పుకోవడం లేదని, భారీగా కట్నం అడుగుతున్నారంటూ మొండికేశాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన మహిళ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పొదుపు సంఘాల బలోపేతానికి కృషి

జూబ్లీహిల్స్ : పొదుపు సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ డీపీఓ వెంకటకిషన్‌రావు తెలిపారు. బుధవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపు ప్రతినిధులతో సమావేశమయ్యారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో నిరుపేద మహిళలతో కొత్త గ్రూపులను తయారుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే ఉన్న పొదుపు సంఘాలకు రుణాలిచ్చినట్లు.. స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహించేందుకు కొత్త గ్రూపులకు కూడా రుణాలివ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు ప్రశాంత్, వెంకటయ్య, శ్రీనివాస రావు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The General public is hereby informed that my client Md. Javaad Ahmed, S/o. Gulam Hussain, R/o. H.No. 3-3-67, Noor Khan Taleem, Bidar District, Karnataka is intended to purchase all that Northern Portion of Plot Nos. 54 & 55, in Survey No. 1, admeasuring 300.00 Sq.yards out of totally admeasuring 600.00 Sq.yards from its owner Smt. Parul Gupta, W/o. Sri Rupeesh Kumar, R/o. Plot No. 70, Ambience Fort, Attapur, Hyderabad, T.S. and if any person(s) have any claim, right, title or interest over the above said property, they can contact the undersigned with all relevant documents within (07) days from the date of this notice or else my client will proceed to complete the sale transaction by execution of registered sale deed and thereafter any objection or claims whatsoever in nature shall be deemed as waived off.

M/s. SUKHRAJ, Advocate
H.No. 12-1-274, Asif Nagar, Kummarwadi, Hyderabad,
Cell No. 09177019888.